క్లుప్తంగా

నేడు కలెక్టర్ పర్యటన

కోస్గి: కలెక్టర్ శ్రీహర్ష శనివారం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించనున్నట్లు కార్యాలయ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.అనంతరం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

ఊట్కూరు: ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోవాలని సంఘం నాయకుడు శ్యాంసుందర్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని వల్లంపల్లి గీత వనాన్ని సందర్శించారు. పేట గీత సంఘం సొంత భూమి 9 ఎకరాలలో 6 ఏళ్ల క్రితం వనాన్ని పెంచిందన్నారు. ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు ఎక్సైజ్ అధికారులు నాణ్యమైన మొక్కలను అందించాలని అన్నారు. ప్రభుత్వం అర్హులైన గీత కార్మికులకు పథకాలను అమలు చేసి ఆదుకోవాలన్నారు. భరత్‌గౌడ్, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ పరీక్ష

నారాయణపేట రూరల్ : పట్టణంలోని నాలుగు పాఠశాలల్లో నవోదయ పరీక్ష శనివారం జరగనుంది. సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూల్, కృష్ణగోకులం, లిటిల్‌స్టార్స్ సెంటర్‌కు 216మందిని, శ్రీసాయిలో 162 మందిని కేటాయించారు. మొత్తం 810మంది చిన్నారులు పరీక్షకు హాజరు కానుండగా వీరి కోసం నలుగురు సీఎస్, నలుగురు డీఓలతో పాటు 42మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కోస్గి: అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి డీకే రాములు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు వందల ఎకరాల్లో చేతికొచ్చిన పంటలను అకాల వర్షం కారణంగా నష్టపోయారని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిహారం ఇవ్వాలన్నారు.

సెల్‌ఫోన్ గుర్తింపు

కోస్గి: అత్యాధునిక సాంకేతికతను వినియోగించి ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించిన పోలీసులు శుక్రవారం అతడికి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈజీపూర్‌నకు చెందిన బాల్‌రాజ్ తన ఫోన్‌ను గ్రామంలోని కిరాణ దుకాణంలో ఉంచగా ఈ నెల 24న గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నూతన టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను కనిపెట్టి అప్పగించారు. సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో బీరలింగేశ్వర జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం సర్పంచ్ నిర్మలమ్మ, నాయకులు రామకృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. అకాల వర్షాలతో భక్తులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నాయకులు మల్‌రెడ్డి, గొరప్ప, రామకృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, కోమటి వెంకటేష్, నర్సింహారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ముగింపు సభకు తరలిరండి

నర్వ: పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని డీఎస్పీ జిల్లా కో కన్వీనర్ ఈశ్వర్ మహారాజ్ శుక్రవారం అన్నారు.30న, హైదరాబాద్‌లో చేపట్టే సభకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మాగనూర్: బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన కోసం దళిత శక్తి ప్రోగ్రాం అధినేత డాక్టర్ విశారదన్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సభను అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ దశరథ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్ రాజు, గోపాలకృష్ణ, సంజీవ్, అనిల్, అంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

మక్తల్ : మండలంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు వెనక్కి తగ్గమని ఈ సందర్భంగా వీఓఏలు స్పష్టం చేశారు. మండల అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రామిరెడ్డి, కోశాధికారి జ్యోతి, మౌనిక, స్వప్న, చంద్రకళ, పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలో కొనసాగుతున్న వీఓఏల సమ్మెలో అధ్యక్షుడు పూంజనూర్ బాబు మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యదర్శి విష్ణు, కోశాధికారి రఘు, వరలక్ష్మి, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మక్తల్: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని మక్తల్ సీఐ సీతయ్య తెలిపారు. టౌన్‌లోని ప్రధాన రహదారికి కలిసే రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లకు వైట్ పెయింట్ వేయించడం వంటి చర్యలు శుక్రవారం చేపట్టామని వివరించారు. వాహనాదారులు నియమిత వేగంతో వాహనాలు నడుపుతూ గమ్యస్థానలకు సురక్షితంగా చేరాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

మండల సమావేశం బహిష్కరణ

- బిల్లుల చెల్లింపులు చేస్తేనే పనులు చేపడతామంటున్న సర్పంచులు
- సభ నుంచి బయటకు వెళ్లిపోయిన వైనం


సభ నుంచి బయటకు వెళ్తున్న సర్పంచ్‌లు


అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ వెంకటయ్య

మద్దూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని మండల సర్పంచ్‌లు బహిష్కరించారు. ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన సమావేశానికి మండల సర్పంచ్‌లు హాజరయ్యారు. కాగా సమావేశం ప్రారంభించడానికి ఎంపీడీఓ విజయలక్ష్మి సన్నద్ధమవుతున్న తరుణంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి కలుగజేసుకొని మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామాల్లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు చేపడితేనే గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కనీసం పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయని గుర్తుచేశాయి. ఫ్రీజింగ్ ఎత్తివేసి బిల్లులన్ని చెల్లింపు చేసేవరకు అధికారులు గ్రామాలకు వచ్చి ఈ పనులు చేయాలి, ఆ పనులు చేయాలని ఆదేశించవద్దన్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టినా సమస్య పరిష్కరం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం సర్వసభ్య సమావేశం నుంచి సర్పంచ్‌లు బయటకు వెళ్లి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ప్రజాప్రతినిధులంటే లెక్కేలేదు!

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల గురించి స్థానిక సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీటీసీలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండోవిడత గొర్రెల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల వివరాలు ఎంపీటీసీలకు అందించకుండానే వారి చేత డీడీ కట్టించుకుంటున్నారని కొమ్మూరు ఎంపీటీసీ లక్ష్మి, మద్దూరు ఎంపీటీసీ వెంకటయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసి గ్రామ సభలు నిర్వహించాలని సూచించినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి వారి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వెంకటయ్య అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఇదివరకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ. 10 వేల వేతనం అందజేస్తున్నారని. ఇదే కోస్గి, నారాయణపేటలో ఇలాంటి కార్మికులకు నెల రూ.14 వేలు అందజేస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వైద్యాధికారి శ్రీలత సభ్యులకు వివరించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, ఎంపీటీసీలు అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. వీటితో భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మందిపల్లిలో నిర్మించిన ఇంకుడుగుంతను పరిశీలించారు. ఇందులో ఎంపీడీఓ సద్గుణ, ఏపీఓ సిద్దేశ్వర్, ఈఓపీఆర్‌డీ సుదర్శన్ పాల్గొన్నారు.

ముగిసిన పుష్కర బ్రహ్మోత్సవాలు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం శ్రీగిరిపీఠంపై కొలువైన భవానీ మాత ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పుష్కర బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

ఊట్కూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు అంగన్‌వాడీ టీచర్లు సహకరించాలని వైద్య సిబ్బంది విజయకుమార్ కోరారు. శుక్రవారం ఊట్కూర్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ల సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. వైద్య సిబ్బంది నర్సిములు, మణిమాల, అంగన్‌వాడీ సూపర్ వైజర్ గీతా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



దామరగిద్ద: అంబేడ్కర్ విశ్వమానవుడని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. విఠలపూర్ శుక్రవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ నిర్మల సమక్షంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 30న ప్రారంభం కానున్న నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరుపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. నేటి యువత, నాయకులు అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ కమ్యునిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధుల మంజూరు పత్రాన్ని ఎంపీపీ నర్సప్పకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతు సమితి కోఆర్డినేటర్ రాచప్ప, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పని గంటల తగ్గింపే లక్ష్యంగా ఉద్యమిద్దాం


కోటకొండలో వాల్‌పోస్టర్ విడుదల నాయకులు

నారాయణపేట రూరల్ : కార్మికుల కనీస వేతనం, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపుపై పోరాటం చేస్తామని ఐఎఫ్‌టీయూ జిల్లా సహ కార్యదర్శి ఎదురింటి నర్సింహులు అన్నారు. మండలంలోని కోటకొండ భగత్‌సింగ్ చౌరస్తాలో శుక్రవారం మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో భీమేష్, రాజు, సలీం, నర్సింహులు, మౌలాలి, రాఘవేందర్, దస్తప్ప, అంజి, కిష్టప్ప, భారతమ్మ, హన్మంతు, అంజి పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : సమస్త కార్మిక వర్గాల పండుగ దినమైన మే డేను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రాములు, బాల్‌రాం శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో అన్ని రంగాల కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మక్తల్: మేడే స్ఫూర్తితో కనీస వేతనాలు పెంపుదల, సామాజిక భద్రత, పని గంటలు తగ్గింపు లక్ష్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. గంగన్న, ఆశన్న, రవి, బండారి బాలు, కృష్ణయ్య, మహేశ్వరమ్మ, రామలింగం, వెంకటేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం మేడే పోస్టరును విడుదల చేశారు. నాయకులు ఆంజనేయులు, నర్సిములు, రాములు, వెంకటప్ప, విజయ్, లాలప్ప పాల్గొన్నారు.

'మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం'

మక్తల్: తెలంగాణాలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అధికార ప్రతినిధి రామలింగం ధీమావ్యక్తం చేశారు. శుక్రవారం మక్తల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదప్రజల అభ్యున్నతికై ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని తెలిపారు. శివారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కోస్గి: మున్సిపల్ విలీన గ్రామం పోతిరెడ్డిపల్లికి చెందిన పలు పార్టీల యువకులు శుక్రవారం ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. రాజశేఖర్ రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతుపై కేసు నమోదు

కోస్గి: ప్రధాన రహదారిపై వరిధాన్యం ఆరబోయడంతో ఓ బైక్ అదుపు తప్పిన ఘటనలో ప్రమాదానికి కారణమైన రైతుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని భక్తిమళ్లకి చెందిన తిరుపతయ్య పేట–కోస్గి జిల్లా రహదారిపై వరిధాన్యం ఆరబోశాడు. కాగా కోయిలకొండ మండలం బూర్గుపల్లికి చెందిన రాజు తన అత్త లక్ష్మితో కలిసి కోస్గికి వస్తున్న క్రమంలో ఆరబోసిన ధాన్యం కారణంగా బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు రైతు తిరుపతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

ధన్వాడ: మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి మెడికల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం(సీపీఆర్)పై శిక్షణ నిర్వహించారు. సూపర్‌వైజర్ కతలప్ప, పీహెచ్ఎన్ శోభారాణి ఉన్నారు.

పదోన్నతి

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శి చంద్రశేఖర్‌కు గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతినిస్తూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతిపై మక్తల్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వెళ్లనున్నారు. చైర్‌పర్సన్ మొసటి జ్యోతి, వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, డైరెక్టర్లు ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. చైర్‌పర్సన్ గందె అనసూయ తదితరులు ఉన్నారు.

రెగ్యులర్ చేయకపోతే ఆందోళనలు


కృష్ణాలో..


కోస్గిలో..


మక్తల్‌లో..


మద్దూర్‌లో సమ్మె చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు

నారాయణపేట రూరల్ : జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులందరికీ రెండేళ్ల ప్రోహిబిషన్ పీరియడ్ ఉంటే సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌లో మూడేళ్లు పెట్టారని, తిరిగి ఆ సమయాన్ని నాలుగేళ్లకు పెంచుతూ జీఓ 26 సైతం ఇచ్చినా అన్ని రకాలుగా ప్రభుత్వానికి సహకరిస్తూ పూర్తి చేశామన్నారు. గత నెలకే తమను రెగ్యులర్ చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఆందోళన బాట పట్టామని అన్నారు. కార్యదర్శులు జ్యోతి, శివకుమార్, బబిత, అనురాధ, నవిత, శ్రీనివాస్, బస్వరాజ్, పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలో చేపట్టిన ధర్నాలో పంచాయతీ కార్యదర్శులు అజయ్, శివకుమార్, శ్రీనివాస్, బాబురావ్, కృష్ణ, వేణగోపాల్, తిమ్మప్ప, రవి, అన్సారీ, లాయక్‌అలి, తిరుపతి పాల్గొన్నారు.

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మరికల్: మండల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం పంచాయితీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని నినాదాలు చేశారు.

కృష్ణా: రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ధర్నా చేపట్టారు. నర్సింహారెడ్డి, మల్లేష్, భాస్కర్, శివశంకర్, రాములు, నర్సిములు తదదితరులు ఉన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మెకు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ జైపాల్ రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజు, రవికుమార్, కిషోర్, నర్సప్ప, రేచల, ఆనంద్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో నిర్వహించిన సమ్మెలో అచ్చుతానంద్, అమర్‌నాథ్‌గౌడ్, నరహరి, సాయినాథ్, శివానంద్, మంజుల పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో చేపట్టిన సమ్మెకు జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి, మండల సర్పంచ్‌లు మద్దతు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, విజయలక్ష్మి, కల్పనా, తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండలంలో చేపట్టిన సమ్మెకు బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ రాము, మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్ మద్దతు ప్రకటించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో నిర్వహించిన సమ్మెలో కార్యదర్శులు అర్జున్, లోకేష్, రాజశేఖర్, అనిత, కురుమూర్తి, రాఘవేందర్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎంశ్రీకి కొండాపూర్ గురుకుల పాఠశాల

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల పీఎం శ్రీ పథకానికి జిల్లా నుంచి ఎంపికైందని ప్రిన్సిపాల్ ఎం.రాజారాం శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేసేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. విద్యాశాఖ ద్వారా 150 పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా 70 పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిందని వాటిలో ప్రస్తుతం 12 పాఠశాలలు ఎంపికయ్యాయని వివరించారు.

విద్యార్థుల ప్రతిభ

ధన్వాడ: కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు కిషన్‌నాయక్, సిద్దార్థలు జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫాస్ట్‌పై బాలబాలికల పోటీలలో సత్తాచాటారని, సెకండ్ రన్నర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ రాజారాం, నెట్‌బాల్ కోచ్ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించారు.

పాము కాటుతో గేదె మృతి

ఊట్కూరు: పాముకాటుతో గేదె మృతిచెందిన ఘటన ఊట్కూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన మూసపేట సుశీలమ్మకు చెందిన గేదెలు గురువారం మేతకు వెళ్లాయి. ఒక గేదె రాత్రి తిరిగి రాకపోవడంతో శుక్రవారం గ్రామశివారులో వెతికారు. గాడిదల వాగు వద్ద గేదె మృతిచెంది పడి ఉండడం, కాలిపై పాముగాట్లు ఉండడంతో సమాచారం అందించగా పశువైద్యాధికారి పరిశీలించారు. పాము కాటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. రూ.50వేల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

నారాయణపేట రూరల్ : స్థానిక పాత బస్టాండ్ వద్ద కాకర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు కాకర్ల భీమయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ శుక్రవారం ప్రారంభించారు. 16 ఏళ్లుగా కార్యక్రమం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి, డీసీసీబీ మాజీ చైర్మెన్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 03 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ రాజు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. 3న పల్లకీసేవ, 4న నరసింహస్వామి జయంతి, 5న ప్రభోత్సవం, కల్యాణోత్సవం , 6న రథోత్సవం, పాలఉట్లు, 7న గరుడ వాహన సేవ, శేష వాహన సేవ, హనుమాన్ వాహసేవ నిర్వహించనున్నారు. అదేవిధంగా సందేరాళ్లపోటీలు, ఇసుక బస్తాలు ఎత్తేపోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం టెంకాయలకు సంబంధించిన టెండర్‌ను గ్రామానికి చెందిన కోమటి రాముశెట్టి రూ. 1 లక్ష నలభై వేలకు సొంతం చేసుకున్నాడని వివరించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

నారాయణపేట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మెన్ డాక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ సహకార కార్యాలయ ఆవరణలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, మున్సిపల్, మార్కెట్ చైర్‌పర్సన్లు గందె అనసూయ, జ్యోతి, వైస్ ఎంపీపీ సుగుణ, మార్కెట్ వైస్ చైర్మెన్ లక్ష్మీకాంత్, కన్న జగదీష్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు వేపూరిరాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దామరగిద్ద: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విండో అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ ఈదప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం, వత్తుగుండ్ల, క్యాతన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డైరెక్టర్‌లు, ఏఈఓలు, సర్పంచ్‌లు, విండో కార్యదర్శి మురారి పాల్గొన్నారు.

రేషన్‌షాపులో 12 రకాల సరుకులు ఇవ్వాలి


పేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : రేషన్ దుకాణాల్లో 12 రకాల సరుకులు అందించాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణపేట తహసీల్దార్ దానయ్యకు వినతి పత్రం అందించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని డబ్బులేని వారిపై దృష్టి సారించాలని, వారి ఆర్థిక సమస్యలను పోగొట్టేందుకు కృషిచేయాలన్నారు. అదేవిధంగా నూతన రేషన్ కార్డులను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో సౌజన్య, లక్ష్మి, ఇస్మాయిల్, సరళ, సునీత, నర్సింహులు, నారాయణ, సాయికుమార్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కోశాధికారి మహాదేవి, ఐఎఫ్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, నాయకులు మల్లేష్, ఈశ్వర్, వెంకటేష్, పోలప్ప పాల్గొన్నారు.

మక్తల్: మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ పీడీఎస్‌యూ నాయకులు భాస్కర్, నాయకులు కిరణ్ పాల్గొన్నారు.

గురువులను పూజించడం సంప్రదాయం


పూజలో పాల్గొన్న భక్తులు

కృష్ణా: భక్తి ఎక్కడ ఉంటుందో అక్కడ సిరి సంపదలు కొలువై ఉంటాయని క్షీరలింగ మహాస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఐనాపూర్ గ్రామంలో గురు పాదపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి స్వామిజీ మాట్లాడారున. ప్రస్తుతం సమాజంలో విజ్ఞానం పేరిట సంస్కృతి, నాగరికత పేరిట విలువలు, రాజకీయాల పేరిట నీతి ధర్మాలను దెబ్బతినకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత, అవసరం ప్రతి ఒక్కరిపైన ఉన్నదని అన్నారు. బీఆర్‌ఎస్ మక్తల్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, అర్చకులు రాజుస్వామి, మంజునాథ్‌స్వామి, బన్నయ్యస్వామి, సర్పంచ్ రమేష్, భక్తులు హాజయ్యారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జెల్లి గ్రామానికి చెందిన గవినోళ్ల కృష్ణారెడ్డి(58) విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా విధించినట్లు మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్టేషన్ సీఐ రవీందర్‌రెడ్డి , ఎస్ఐ అంజయ్య శుక్రవారం తెలిపారు. కృష్ణారెడ్డి తడు గ్రామంలోని తన ఇంటికి మొదటగా మార్చి 2021 సంవత్సరంలో అక్రమ విద్యుత్ వాడడం వల్ల స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు మొదటి తప్పుగా భావించి ఫైన్ వేశారని అన్నారు. కానీ తిరిగి అదే సంవత్సరం మళ్లీ అక్రమ విద్యుత్ వాడుతుండగా ప్రత్యేక అధికారులు నిర్వహించిన తనిఖీలో గుర్తించారని వివరించారు. దీంతో మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్‌స్టేషన్‌లో రెండవ కేసుగా అప్పటి సీఐ కాశిరెడ్డి కేసు నమోదు చేశారని వివరించారు. నారాయణపేట జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ వేయగా అట్టి వ్యక్తికి రూ. 35,388 జరిమానా విధించారని, డబ్బులు కట్టని పక్షంలో ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు.